ప్రజావాణి.. 3 వినతిపత్రాలు

హఫీజ్‌పేట్: చందానగర్ సర్కిల్– 21 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 3 వినతులు అందాయని ఉపకమిషనర్ వంశీకృష్ణ తెలిపారు. రెండు టౌన్‌ప్లానింగ్‌కు సంబంధించింది కాగా మరొకటి యూసీడీలకు వసతులపై వచ్చాయన్నారు. ప్రజలు తమ సమస్యలను ప్రజావాణిలో వినిపించవచ్చని తెలిపారు.

శేరిలింగంపల్లిలో..

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి సర్కిల్‌లో ప్రజావాణికి మూడు దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఒక దరఖాస్తు అభయ హస్తానికి రాగా, మరో రెండు దరఖాస్తుల్లో టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ విభాగాలకు ఒక్కొక్కటి వచ్చినట్లు వివరించారు. డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సర్కిల్ ఏసీపీ మెహ్రా, ఏఎంసీ నరేందర్‌రెడ్డి, ప్రాజెక్టు ఆఫీసర్ మల్లీశ్వరీ, అర్బన్ బయోడైవర్సిటీ మేనేజర్ యూసుఫ్, ఏఈ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో .. టమాట 30, పచ్చిమిర్చి 50–60, బెండ 60, కాకర 60, దొండ 50, దోస 40, ఆలు 25, చామ 60, కీర 40, బీర 60, వంకాయ 30, గోకర 60, బీన్స్ 50, బీట్‌రూట్ 40, క్యాప్సికమ్ 60, క్యాబేజీ 25, క్యారెట్ 40, చిక్కుడు 50, ఉల్లి 25(కేజీ), ములక్కాయలు (1)10 , క్యాలీఫ్లవర్ (1) 30, సొరకాయ (కేజీ) 20, అల్లం 280, వెల్లుల్లి 280.

13 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిందని పటాన్‌చెరు ట్రాఫిక్ సీఐ రామకృష్ణారెడ్డి తెలిపారు. వివరాల ప్రకారం.శని, ఆదివారాల్లో నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్‌లో 13 మంది పట్టుబడగా వారిని సోమవారం సంగారెడ్డి కోర్టులో హాజరు పర్చగా, జడ్జి 13 మందికి ఒక్కొక్కరికీ రూ. 10 వేల జరిమాన విధించినట్లు పేర్కొన్నారు.

అభివృద్ధి పనుల్లో ఆలస్యం

రోడ్ల విస్తరణ, లింకురోడ్డు, బాక్స్‌టైప్ కల్వర్టు, డ్రైయిన్ , పార్కుల నిర్మాణం ఎప్పడో.?

సాగుతూనే ఉన్న పనులు

శేరిలింగంపల్లి: అభివృద్ధి పనుల్లో ఆలస్యం జరుగుతూనే ఉంది. రోడ్ల విస్తరణ, లింకురోడ్డు ప్రతిపాదనలకే పరిమితం కావడం, పార్కుల అభివృద్ధి తదితర పనులు సాగుతున్నా.. సమయానికి పూర్తి చేయలేకపోతున్నారనే భావన కలుగుతోంది. రెండేళ్లు అన్న రోడ్డు విస్తరణ ఆరేళ్లయినా ఇప్పటికీ కొనసాగుతూనే ఉండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బాక్స్‌టైప్ డ్రెయిన్, నాలా పనులు చురుగ్గా జరుగుతున్నాయి. అయినా ఈ పనులతో వాహనదారులకు ఇక్కట్లు తప్పడం లేదు. ఈ పనులు సకాలంలో పూర్తయితే ప్రజలకు అవస్థలు తప్పుతాయి.



ఏళ్లుగా రోడ్డు విస్తరణ..

ఆరేళ్ల క్రితం నల్లగండ్ల రైల్‌ఓవర్ బ్రిడ్జి నుంచి నల్లగండ్ల హుడా కాలనీ మీదుగా గోపన్‌పల్లి, గోపన్‌పల్లి తండా, ఎన్టీఆర్‌కాలనీ నుంచి వట్టినాగులపల్లి వరకు ఉన్న రోడ్డు విస్తరణ పనులను అప్పటి మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. దీన్ని రెండేళ్లలో పూర్తి చేస్తామన్నారు. కానీ ఆరేళ్లు అయినా ఇప్పటి వరకు కొన్నిచోట్ల మాత్రమే పూర్తి చేశారు.ఇంకా రోడ్డుకు ఇరువైపులా డ్రైన్స్, సెంట్రల్ లైటింగ్ పూర్తిస్థాయిలో చేయాల్సిన అవసరం ఉంది.

పార్కులను అందుబాటులోకి తేవాలి..

నల్లగండ్ల హుడా కాలనీలో రెండు థీమ్ పార్కుల నిర్మాణం తలపెట్టారు. కాలనీవాసులే కాకుండా చుట్టూరా ఉండే అపార్ట్‌మెంట్, గేటెడ్ కమ్యూనిటీవాసులు సేద తీరేందుకు అవకాశం కలుగుతుంది. ఇందులో భాగంగా రూ.3.20 కోట్లతో ఎకో సెంట్రల్ పార్కు, రూ.2.60 కోట్లతో ఇల్యూజన్ పార్కు పనులు చేపట్టారు, త్వరితగతిన పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రతిపాదనలకే పరిమితం..

గత ప్రభుత్వం లింకురోడ్లకు పెద్ద ఎత్తున ప్రాధాన్యం ఇచ్చిన విషయం తెలిసిందే. అందులో భాగంగా శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలో వీటి నిర్మాణం చాలా వరకు పూర్తయ్యింది. కానీ పాత ముంబాయి జాతీయ రహదారి నుంచి హెచ్‌సీయూ ఆర్టీసీ డిపో పక్క నుంచి నల్లగండ్లలోని రత్నదీప్ సూపర్‌మార్కెట్ వరకు లింకురోడ్డు నిర్మాణం చేయాలని తలపెట్టారు. అందుకు 1.8 కిలోమీటర్ల రోడ్డును రూ.21.54 కోట్లతో చేపట్టాలని నిర్ణయించారు. కానీ ఈలోగా ప్రభుత్వం మారిపోవడంతో ఈ రోడ్డు ప్రశ్నార్థకంగా మారింది.

పనులతో రాకపోకలకు అవస్థలు

లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి నుంచి రాకపోకలు నిలిచిపోకుండా చర్యలు తీసుకోవడంలో భాగంగా రూ.4కోట్లతో బాక్స్‌టైప్ కల్వర్టు, డ్రైయిన్ నిర్మాణ పనులను ఎన్నికలకు ముందు ప్రారంభించారు. ఈ మార్గంలో వాహనాలను మళ్లించడంతో స్థానికులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు అసౌకర్యానికి గురవుతున్నారు. ఇప్పటి వరకు చిన్నపాటి వర్షం కురిసినా వరద నీరంతా అండర్ బ్రిడ్జి కింద చేరడం ..వాహనాల రాకపోకలు నిలిచిపోవడం పరిపాటిగా మారింది. వెంటనే ఈ పనులను పూర్తి చేయాల్సి ఉంది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో సకాలంలో పూర్తి చేయాలని కోరుతున్నారు.



నల్లగండ్ల హుడా కాలనీ నుంచి గోపన్‌పల్లి వైపు వెళ్లే లింకు రోడ్డులో ఇరువైపులా డ్రైన్ నిర్మించని దృశ్యం



లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద కొనసాగుతున్న బాక్స్ టైప్ డ్రైన్ పనులు

16న భారత్‌బంద్‌ను జయప్రదం చేయండి

కూకట్‌పల్లి: కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలపై ఈనెల 16వ తేదీన దేశవ్యాప్త కార్మికుల సమ్మెను, గ్రామీణ భారత్‌బంద్‌ను జయప్రదం చేయాలని సోమవారం భాగ్యనగర్ భవన నిర్మాణ కార్మికుల అడ్డ, ఆటోస్టాండ్ వద్ద సీఐటీయూ నాయకులు కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీఐటీయూ జిల్లా నాయకులు ఎం. శంకర్, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకుడు రాములు పాల్గొని పోస్టర్ ఆవిష్కరించి ప్రసంగించారు. అఖిల భారత ఫెడరేషన్లు, సంయుక్త కిసాన్ మోర్చా అఖిల భారత స్థాయిలో సమ్మె చేయాలని పిలుపునిచ్చాయని తెలిపారు. అందులో భాగంగా తెలంగాణలో కార్మికుల సమ్మె గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని కోరారు. ప్రతి సంవత్సరం రూ.2కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని కేంద్రం హామీ ఇచ్చి నెరవేర్చలేదన్నారు. శ్రామికుల నిజ వేతనాలు 20 శాతం తగ్గిపోయాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోరే భాయ్, శేఖర్ , రవి, రాజేందర్, రవి, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

5జీ టెక్నాలజీపై గీతమ్‌లో ఎఫ్‌ఏపీ

పటాన్‌చెరు: గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని ఈఈసీఈ విభాగం ఆధ్వర్యంలో '5జీ టెక్నాలజీ, పురోగతి' అని అంశంపై ఈనెల 8, 9 తేదీలలో అధ్యాపక వికాస కార్యక్రమాన్ని (ఎఫ్‌ఏపీ) నిర్వహించనున్నామని ఆ విభాగాధిపతి ప్రొఫెసర్ మాధవి సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. 5జీ టెక్నాలజీలో తాజా పరిణామాలు, అధునాతన కమ్యూనికేషన్ టెక్నాలజీ పరిశోధనకు అవకాశాలను తెలియజేయడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఉచిత ఎఫ్‌పీలో పాల్గొనాలనే ఆసక్తి ఉన్నవారు తమ పేర్లను ఈనెల 7వ తేదీలోగా నమోదు చేసుకోవాలని, 50 మందికి మాత్రమే అవకాశం ఉంటుందనిన్నారు. అవసరమైన వారికి నామమాత్రపు ధరకే గీతం హాస్టళ్లలో వసతి కల్పిస్తామని, అయితే ఆ విషయాన్ని నిర్వాహకులకు ముందుగా తెలియజేయాలని ఆమె తెలిపారు.మరింత సమాచారం కోసం ఎఫ్‌ఎపీ సమన్వయకర్త రఘుపతి (94415 44079)ని సంప్రదించాలని సూచించారు.

పార్ట్ టైమ్ పీహెచ్‌డీకి దరఖాస్తుల ఆహ్వానం

ఫిబ్రవరి 18 ఆఖరు తేదీ

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో పార్ట్‌టైమ్ పీహెచ్‌డీలో ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు 'మనూ' అడ్మిషన్స్ డైరెక్టరేట్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం వనజ తెలిపారు. ఉర్దూ విశ్వవిద్యాలయం హైదరాబాద్ క్యాంపస్‌లో స్పాన్సర్డ్ సెల్ఫ్ ఫైనాన్సింగ్ మోడ్‌లో పార్ట్‌టైమ్ పీహెచ్‌డీ కోర్సులో అడ్మిషన్లు అందిస్తుందన్నారు. దరఖాస్తు ఫారమ్‌లను ఆన్‌లైన్‌లో సమర్పించడానికి చివరి తేదీ ఫిబ్రవరి 18 అని ఆమె పేర్కొన్నారు. స్కూల్ ఆఫ్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్, స్కూల్ ఆఫ్ సైన్సెస్,స్కూల్ ఆఫ్ టెక్నాలజీ, స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్, స్కూల్ ఆఫ్ మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజమ్ స్కూల్‌లో పార్ట్‌టైమ్ పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయని వివరించారు. అడ్మిషన్ టెస్ట్ మార్చి 8న జరుగుతుందన్నారు. అడ్మిషన్ల తేదీ, ఆన్‌లైన్ ఫీజు చెల్లింపు తేదీ ఏప్రిల్ 3,4 తేదీలని, దరఖాస్తులను వెబ్‌సైట్ ద్వారా పరిశీలించాలని కోరారు.

కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి

హఫీజ్‌పేట్: కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారని ఆ పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గం ఇంచార్జి జగదీశ్వర్‌గౌడ్ పేర్కొన్నారు. సోమవారం మాదాపూర్ డివిజన్ పరిధిలోని సుభాష్‌చంద్రబోస్‌నగర్‌లో బీఆర్‌ఎస్ పార్టీ బస్తీ అధ్యక్షులు ముక్తర్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. వారందరికి ఆయన పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీతోనే నియోజకవర్గం అభివృద్ధి సాధ్యమన్నారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజల సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తుందన్నారు.కార్యక్రమంలో నాయకులు సయ్యద్ గౌస్, మహిపాల్ యాదవ్, నగేష్ నాయక్, మునాఫ్ ఖాన్, ఇస్మాయిల్, సాజిద్, జఫ్ఫార్, ఆనంద్‌సింగ్, మహేష్, మెయిన్ పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ కోఆర్డినేటర్‌గా శ్రీకాంత్‌రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పటాన్‌చెరు నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ కోఆర్డినేటర్‌గా తెల్లాపూర్‌కి చెందిన శ్రీకాంత్ రెడ్డి నియమితులయ్యారు. ఈ సందర్భంగా సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ తనను నియోజవర్గ యూత్ కాంగ్రెస్ కోఆర్డినేటర్‌గా నియమించిన పార్టీ అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో పర్యటించి కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరవేస్తామన్నారు.

బాటిల్ ఆఫ్ బ్యాండ్స్ విజేతగా ముజిగల్

సాక్షి, సిటీబ్యూరో: నగరవ్యాప్తంగా ఉన్న సంగీత అకాడమీలకు సంబంధించి నిర్వహించిన ×బాటిల్ ఆఫ్ బ్యాండ్స్‌₹ కాంటెస్ట్‌లో ముజిగల్ అకాడమీ ఆధ్వర్యంలోని మాదాపూర్ శాఖకు చెందిన విద్యార్థుల సంగీత బృందం గెలుపొందింది. ఈ విషయాన్ని సంస్థ వ్యవస్థాపకులు డా.లక్ష్మీనారాయణ యేలూరి తెలిపారు. నగరంలోని 12 అకాడమీలు ఈ పోటీలో పాల్గొన్నాయన్నారు. వైవిధ్యభరితమైన బూట్ క్యాంప్స్, లోతైన అవగాహన అందించే తరగతులు...విద్యార్థులు, టీచర్లకు మధ్య అనుబంధాన్ని పెంచే క్రికెట్ మ్యాచ్ తదితర ఆటల పోటీల ద్వారా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నామన్నారు.

ఫోన్ మాట్లాడుతూ.. కిందపడి వ్యక్తి మృతి

పటాన్‌చెరు టౌన్: నిర్మాణంలో ఉన్న భవనం ఐదో అంతస్తుపై నిలబడి ఫోన్ మాట్లాడుతూ ప్రమాదవశాత్తు కిందపడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది సీఐ రవీందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మహారాష్ట్ర నాందేడ్‌కు చెందిన గణేష్ బతుకుదెరువు కోసం భార్యతో కలిసి హైదరాబాద్ కాచిగూడ కు వచ్చి పెయింటర్ పని చేసుకుంటున్నాడు. నెల రోజుల నుండి రామచంద్రాపురం పరిధిలోని వెలిమెల గార్డియన్ స్కూల్ డీ–బ్లాక్ వద్ద పనిచేస్తున్నాడు. ఆదివారం రాత్రి పని చేసే చోట ఐదో అంతస్తు పై నుండి ఫోన్ మాట్లాడుతూ ప్రమాదవశాత్తు పై నుండి కిందపడ్డాడు.దీంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.మృతుడి భార్య గాయత్రి స్కూల్ యజమాన్యం, కాంట్రాక్టర్ ప్రమోద్ భవనం వద్ద సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్లనే తన భర్త మృతి చెందాడని సోమవారం ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

తెలుగు టీవీ, డిజిటల్ మీడియా నూతన ఫెడరేషన్ కార్యవర్గం

బంజారాహిల్స్: గతేడాది డిసెంబర్ 31న జరిగిన తెలుగు టెలివిజన్ – డిజిటల్ ఓటిటి మీడియా పరిశ్రమ లోని 24 క్రాఫ్ట్స్ ఫెడరేషన్ ఎన్నికల్లో యునానిమస్ గా గెలిచిన కార్యవర్గ ప్రమాణం స్వీకార కార్యక్రమం సోమవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అడిషనల్ లేబర్ కమిషనర్ గంగాధర్, తెలుగు టెలివిజన్ డిజిటల్–ఓటీటీ ప్రొడ్యూసర్ కౌన్సిల్ చైర్మన్ ఎ.ప్రసాదరావు, విశిష్ట అతిథులుగా తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షుడు అనిల్ వల్లభనేని, ప్రధాన కార్యదర్శి ఎస్.ఎస్.దొర, కోశాధికారి వి.సురేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ నూతన అధ్యక్షుడిగా కొయ్యలముడి రాకేష్, కార్యవర్గ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు.

స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

సంక్షేమ సంఘాలకు ఎమ్మెల్యే కృష్ణారావు సూచన



ఎమ్మెల్యే కృష్ణారావును కలిసిన అవంతినగర్ తోట సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ సభ్యులు

మోతీనగర్: సంక్షేమ సంఘాలు రాజకీయాలకు అతీతంగా స్థానిక సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తిస్తూ వాటి పరిష్కారానికి కృషి చేయాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ఆదివారం మూసాపేట డివిజన్ అవంతినగర్ తోట సంక్షేమ సంఘం నూతన అధ్యక్షుడు జి. వెంకటేశ్వరరావు సోమవారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును మర్యాదపూర్వకంగా కలిసి ఆయన ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తిస్తూ వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. వెంకటేశ్వరరావు గెలుపు కోసం కృషి చేసిన మాజీ కౌన్సిలర్ సీహెచ్ సత్యనారాయణ, మాజీ అధ్యక్షుడు గార్లపాటి మోహన్‌రెడ్డిలను ప్రత్యేకంగా అభినందించారు. ప్రతి ఒక్కరూ సమాజ అభివృద్ధి కోసం కృషి చేయాలన్నారు. నిరంతరం అభివృద్ధే లక్ష్యంగా సంక్షేమ సంఘాలు పనిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఐలయ్య యాదవ్, భీమ్ లింగప్ప, బి.ఫణికుమార్, పినిపే చిన్నఅబ్బులు, ఆర్. సత్యనారాయణస్వామి, నాగుల సత్యం గంగపుత్ర, జైపాల్ ముదిరాజ్, రమేష్, వెంకట్‌రెడ్డి, సుబ్బు తదితరులు పాల్గొన్నారు.

రిక్షాపుల్లర్స్ కాలనీలో నిత్యం డ్రైనేజీ సమస్య



రిక్షాపుల్లర్స్ కాలనీలో రోడ్డుపై పారుతున్న మురుగు

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్ రిక్షాపుల్లర్స్ కాలనీ జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆనుకొని ఉన్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ సుమారు 9 నెలలుగా పొంగుతోంది. రోడ్డుపై మురుగు పారుతుండడంతో దుర్వాసనతో పాటు దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. దీంతో విద్యార్థులు తరగతి గదుల్లో ఉండలేకపోతున్నారు. పగటి పూట కూడా దోమలు కుడుతుండడంతో విద్యార్థులు జ్వరాల బారిన పడుతున్నారని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. కొన్ని నెలలుగా డ్రైనేజీ ప్రవహిస్తున్నా స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. ఈ కాలనీ నుంచే కూకట్‌పల్లి సర్కిల్ ప్రాంతానికి పారిశుధ్య కార్మికులు విధులకు హాజరవుతుంటారు. సూపర్‌వైజర్లు సైతం ఇదే కాలనీలో ఉంటున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు కృషి చేస్తా

కాంగ్రెస్ నేత శేరి సతీష్‌రెడ్డి

మూసాపేట: కూకట్‌పల్లి డాక్టర్ బీఆర్. అంబేడ్కర్ అమర జ్యోతి అసోసియేషన్ వారికి తన పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని.. అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటు కోసం తనవంతు కృషి చేస్తానని కాంగ్రెస్ సీనియర్ నేత శేరి సతీష్‌రెడ్డి అన్నారు. మూసాపేటకు చెందిన అంబేడ్కర్ నగర్ కాలనీవాసులు సోమవారం శేరి సతీష్ రెడ్డిని కలిసి అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందజేశారు. అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుతో పాటు ఆలయం చుట్టూ గ్రిల్ ఫెన్సింగ్, సీసీ కెమెరాలు, రెండు కమాన్‌లు ఏర్పాటు చేయాలని వినతిపత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పి. కృష్ణ, కె. డాకయ్య, సాయి, కె. నర్సింగ్‌రావు, జే. సురేష్ తదితరులు పాల్గొన్నారు.



శేరి సతీష్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న అసోసియేషన్ నాయకులు

'చెరువుల పరిరక్షణ బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుంది'

భాగ్యనగర్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మ చెరువును సోమవారం శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వి. జగదీశ్వర్ గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెరువుల పరిరక్షణ బాధ్యతను కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. ప్రతి డివిజన్ అభివృద్దే ధ్యేయంగా సాగుతామన్నారు. ఎల్లమ్మ చెరువు వద్ద చేపట్టవలసిన సుందరీకరణ పనులను ఇరిగేషన్ అధికారులు, పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ భానుప్రసాద్, నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, గఫూర్, డివిజన్ అధ్యక్షుడు మారెళ్ల శ్రీనివాసరావు, శశి, రవి తదితరులు పాల్గొన్నారు.



ఎల్లమ్మ చెరువు వద్ద అధికారులతో మాట్లాడుతున్న జగదీశ్వర్‌గౌడ్, నాయకులు

విద్యుత్ తీగల సమస్యను పరిష్కరించండి

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ పరిధిలోని ఫ్రెండ్స్‌కాలనీలో సోమవారం కార్పొరేటర్ సబిహా బేగం పర్యటించారు. ఇటీవల ఈ కాలనీ కొత్తగా విద్యుత్ తీగలను వేశారు. ఈ వైర్లు ఓ ఇంటిపై నుంచి చేతికి అదేంత దూరం విద్యుత్ తీగలు ప్రమాదకరంగా వేశారని స్థానికులు ఆమె దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే అక్కడకు వెళ్లి పరిశీలించిన ఆమె ఈ సమస్యను పరిష్కరించాలని విద్యుత్‌శాఖ అధికారులను కోరారు.

బీఆర్‌ఎస్‌కు కర్క పెంటయ్య, కర్క నాగరాజు రాజీనామా



కర్క పెంటయ్య



కర్క నాగరాజు

మూసాపేట: కూకట్‌పల్లి నియోజకవర్గ బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు కర్క పెంటయ్య, ఆయన కుమారుడు నియోజకవర్గ బీఆర్‌టీయూ కార్మిక విభాగం అధ్యక్షుడు కర్క నాగరాజు సోమవారం రాజీనామా చేశారు. తమ రాజీనామా పత్రాన్ని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు పంపించారు.

శుభాకాంక్షలు



షబ్బీర్ అలీకి శుభాకాంక్షలు తెలుపుతున్న చున్నూ పాషా, కాంగ్రెస్ నాయకులు

మూసాపేట: తెలంగాణ ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనార్టీ అఫైర్స్ సలహాదారులుగా షబ్బీర్ అలీని నియమించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా మూసాపేట కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చున్నూ పాషా ఆధ్వర్యంలో పలువురు నాయకులు సోమవారం షబ్బీర్ అలీని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మైనార్టీల సమస్యలు పరిష్కరించాలని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎండీ నహీం, అస్లాం, సోఫీ, ఖాజా, మోసిన్, జాకీర్, ఇర్ఫాన్, టింకు, చైతన్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



మూసాపేట: కూకట్‌పల్లి ప్రశాంత్‌నగర్‌లోని అమ్మ మెస్ దగ్గర రోడ్డు పక్కన గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు పరిసర ప్రాంతాల వారిని ఆరాతీయగా భిక్షాటన చేసుకునేవాడని తెలిపారు. సోమవారం ఉదయం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బోరబండ ఇన్‌స్పెక్టర్‌గా ఆదిరెడ్డి

రహమత్‌నగర్: బోరబండ పోలీస్ స్టేషన్ కొత్త ఎస్‌హెచ్‌ఓగా కొడిదల ఆదిరెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన విజయ్ తిరుమలగిరికి బదిలీపై వెళ్లారు. 2007 బ్యాచ్‌కు చెందిన ఆదిరెడ్డి గతంలో హుమయూన్ నగర్, సీసీఎస్‌లలో ఎస్‌ఐగా, రైల్వేలో ఎస్‌ఐ, సీఐగా పని చేశారు. ఇన్‌స్పెక్టర్ ఆదిరెడ్డికు డీఐ భూపాల్‌రెడ్డి, అడ్మిన్ ఎస్‌ఐ సప్నారెడ్డి, సెక్టార్ ఎస్‌ఐలు సర్దార్ జమాల్, మనోజ్, తుల్జారాం సిబ్బంది ఘన స్వాగతం పలికారు.

ఫతేనగర్ డివిజన్ పెండింగ్ పనులను పూర్తిచేస్తాం



ఇందిరాగాంధీ పురంలో సీసీరోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్

కూకట్‌పల్లి: ఫతేనగర్ డివిజన్ ఇందిరాగాంధీపురంలో ఇటీవల రూ.30 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును సోమవారం కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సహాయ సహకారాలతో ఫతేనగర్ డివిజన్ అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని అన్నారు. పెండింగ్‌లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేస్తామని.. అధికారులు ఆ దిశగా పని చేయాలన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ పవన్, ఫతేనగర్ డివిజన్ అధ్యక్షుడు కంచి భిక్షపతి, నాయకులు కుతాడి రాములు, ఇమ్రాన్, అఫ్జల్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న 'విజ్ఞానోత్సవ్'

హెచ్‌సీయూ క్యాంపస్ స్కూల్‌లో నిర్వహణ

రాయదుర్గం: అట్టహాసంగా నిర్వహించిన 'విజ్ఞానోత్సవ్' కార్యక్రమం విద్యార్థులను ఆకట్టుకోవడమే కాకుండా ఆలోచింప చేసింది. హెచ్‌సీయూ క్యాంపస్ స్కూల్‌లో సోమవారం స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్, జూనియర్ సైన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో 'విజ్ఞానోత్సవ్' పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రశంసాపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం వైస్ ప్రిన్సిపల్ మిరాజ్‌ఫాతిమా మాట్లాడుతూ మన విజ్ఞానాన్ని మన దేశ అభివృద్ధికి వినియోగించాలని సూచించారు. ప్రపంచ స్థాయిలో అన్ని రంగాలలో భారత్ తనకంటూ ప్రత్యేకతను సాధిస్తూ వస్తోందన్నారు. అంతకు ముందు క్యాంపస్‌లోని పలు ల్యాబ్‌లను పరిశీలించారు. విజేతలకు బహుమతులను అందించారు.



ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

హెచ్‌సీయూకు అరుదైన గుర్తింపు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి అరుదైన గుర్తింపు లభించింది. ఒకేసారి రెండు 'పేటెంట్లు' లభించడం విశేషం. హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ ఫిజిక్స్ ప్రొఫెసర్లు కేసీ జేమ్స్ రాజు, వి శేషుబాయి ఆధ్వర్యంలో పరిశోధక విద్యార్థులు టి అనిల్, స్వరూప్‌రాజు కలిపి 'ఏక పక్ష ఆకృతుల డైలెక్ట్రిక్ రెసొనేటర్‌లను సిద్ధం చేసే పద్ధతి' పేరిట పరిశోధన చేశారు. ఇది తక్కువ నష్ట విద్యుత్ వాహకంతో త్రీ డి మైక్రోవేవ్ రేడియేటింగ్ నిర్మాణాలను గ్రహించడానికి ఒక సాంకేతికత సాధించేందుకు ఈ పరిశోధన చేశారు.

హనుమాన్‌నగర్‌కాలనీ అభివృద్ధికి కృషి

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని హనుమాన్‌నగర్ కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు సోమవారం ఎమ్మెల్యే అరెకపూడి గాంధీని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నూతన సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. కాలనీ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు ఎం. విఠల్, ప్రధాన కార్యదర్శి బి.విఠల్, కోశాధికారి వీరేశం, ఎల్లం నాయుడు, నర్సింహులు, ఎర్రన్న, రాము, టైల్స్ శ్రీను, కాశీమ్ యాదవ్, మల్లేష్ యాదవ్, జోగరావు, లోహిత్, అప్పారావు, పరమేష్‌గౌడ్, తిమ్మప్ప, రాంచందర్, కాలనీవాసులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే అరెకపూడి గాంధీని కలిసిన నూతన కార్యవర్గ సభ్యులు